క్లుప్తంగా

భక్తుల విడిది కోసం షెడ్డు



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యం వేలాదిభక్తులు వస్తుంటారని, వారికి అవసరమైన సదుపాయాల కోసం పలు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం భక్తులు విడిది కోసం ఏర్పాటు చేసిన షెడ్డును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సేదతీరేందుకు ఇది సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నాడు-నేడు రెండవ విడత పనులను వేగవంతం చేసి, త్వరతగతిన పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం తెలిపారు. శనివారం గాజుల పెళ్లూరు పంచాయతీ పరిధిలోని ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు 2వ విడతలో భాగంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడ, భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. రెండవ విడత విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో జరుగుతున్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ

సత్యవేడు: మండలంలోని పెద్ద ఈటిపాకం పచాయతీ సత్రం గ్రామంలో కల్వర్ట్, శ్మశాన రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు సర్పంచ్ రూబెన్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యురాలు శెల్వి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణ, ఏతు దేవిప్రసాద్‌తో కలసి భూమి పూజా చేశారు. మండల గ్రాంటు కింద కల్వర్ట్‌కు రూ.2లక్షలు, గ్రావెల్ రోడ్డు 180 మీటర్లు నిర్మాణానికి రూ.లక్ష మంజూరైంది.

ప్రలోభాలకు గురి చేస్తే కోడ్ ఉల్లంఘించినట్టే



మాట్లాడుతున్న ఎన్నికల ఆర్‌ఓ నరసింహులు

సత్యవేడు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కోడ్ ఉల్లంఘించినట్లేనని సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేపీ నరసింహులు అన్నారు. శనివారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీ నాయకులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు ఎన్నికల నియమావళి పాటించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాలను రాజకీయ సమావేశాలకు ఉపయోగించకూడదని తెలిపారు. వలంటీర్లు ఎన్నికల విధులకు దూరంగా ఉండాలన్నారు. ఏఈఆర్‌ఓ రామాంజనేయులు, తహసీల్దార్లు ఆలీఖాన్, వై.ఉదయ భారతి, ఎం, శ్రీరాములు నాయక్, పి.శంకర్‌రావు, డి.హుసేన్‌సాహెబ్, సి.నరసింహులు, ఎస్ఐ వీరాంజనేయులు, పార్టీ నాయకులు శ్యాం ప్రసాద్‌రెడ్డి(వైఎస్సార్‌సీపీ) మునిప్రతాప్(బీజేపీ), శేషాద్రి(కాంగ్రెస్) పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

వరదయ్యపాళెం: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పాదిరి కుప్పం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ కథనం మేరకు.. పాదిరికుప్పంకు చెందిన ఏ.వసంత (43) కుటుంబ కలహాలతో 14ఏళ్ల కిందట తన భర్తను వదిలి ఒంటరిగా జీవనం సాగిస్తోంది. శ్రీసిటీ పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. కుమారుడు మునీంద్ర పుత్తూరులో ఇంటర్ చదువుతుండగా, కుమార్తె ఈశ్వరి సత్యవేడు మండలం మదనంబేడులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. కుమారుడు ఇంటర్ పరీక్షలు ముగించుకుని శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి మూత వేసి ఉన్న ఇంటి తలుపు తెరచి చూడగా తన తల్లి ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని చూసి సమీప బంధువులకు సమాచారమిచ్చాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ ప్రతాప్ సిబ్బందితో కలసి సంఘటన స్థలంకు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. ఆమె 3 రోజుల కిందట ఉరేసుకుని మృతి చెంది ఉండవచ్చని పోలీసులు నిర్ధారించారు. సంఘటన స్థలంలోని శవపంచనామా నిర్వహించారు. పిల్లల పోషణ భారం కావడం, బతుకు జీవనం సాగించడం కష్టమని భావించి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఇంటి లోపల గోడకు రాసి ఉండడం గమనార్హం. ఈ విషయాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ధ్రువపత్రాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం సామాజిక తనిఖీ గ్రామసభలో వ్యవసాయాధికారి భారతి ఈ-పంట నమోదు ధ్రువీకరణ పత్రాలను రైతులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 3,218 మంది రైతులకు సంబంధించిన 8,587 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి అయిందన్నారు.

నేనెప్పటికీ ప్రజా సేవకుడినే..



రేణిగుంట: 'ఎమ్మెల్యేగా 2019లో గెలిచిన నాటి నుంచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట,సుఖాల్లో తోడుగా నిలిచాను. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు వచ్చేలా కృషి చేశాను. సొంత నిధులతో దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో ఏ పేదవాడు మృతి చెందినా దహనక్రియలకు రూ.10వేలు అందిస్తున్నా. పేద ముస్లింల కుటుంబాల్లో వివాహం జరిగితే బెడ్ మంచం, బీరువా, టీవీ మేనమామ సాంగ్యం కింద అందిస్తున్నా. చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, పేద పిల్లల చదువులకు ఆర్థిక సాయం... ఇలా ఎన్నో కార్యక్రమాలను సొంత నిధులతో నియోజకవర్గ ప్రజలకు అందించా. పట్టణంలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి ఆపద అని వచ్చిన సామాన్యుడికి కూడా కొండంత భరోసా కలిగించేలా వారి సమస్యలకు పరిష్కారం చూపాను. 30ఏళ్లు పాలించిన నాయకులు చేయలేని అభివృద్ధిని నాలుగున్నరేళ్లలో చేసి చూపా. ఎమ్మెల్యే పదవిని ఎప్పుడూ అలంకారంగా భావించలేదు. బాధ్యతగా ప్రజల సేవకుడిగా నేను, నా బిడ్డలు పవిత్రారెడ్డి, ఆకర్ష్‌రెడ్డి పని చేశాం. రానున్న ఎన్నికల్లో మరోసారి నన్ను గెలిపిస్తే అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటా.

– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, శ్రీకాళహస్తి

ప్రజలకు అందుబాటులో ఉంటా



వరదయ్యపాళెం: ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి కోసం సేవకుడిలా పనిచేస్తా. నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో కార్యాలయం ఏర్పాటు చేసి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా. నేను రాజకీయ కుటుంబం నుంచి వచ్చాను. తల్లి వేపంజేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై నాకు మంచి అవగాహన ఉంది. ఆంధ్ర-తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా నియమితులైన రోజు నుంచి దాదాపుగా నెలరోజులకు పైగా ఏడు మండలాల్లో పర్యటించా. వైఎస్సార్ సీపీ నేతలందరితో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాను. స్థానికంగా నా దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లా. నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నా. గత పరిణామాలకు భిన్నంగా అభివృద్ధిలో ప్రత్యేక ముద్ర వేస్తా. సత్యవేడు నియోజకవర్గ సేవకు తనను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి కోసం శాయశక్తులా శ్రమిస్తా.

–నూకతోటి రాజేష్, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

గాజులమండ్యం ఎస్ఐగా సునీల్



రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం ఎస్ఐగా సునీల్‌కుమార్ శనివారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న ధర్మారెడ్డి వడమాలపేటకు బదిలీ అయ్యారు.సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అందరి సహకారంతో ఎన్నికల సజావుగా నిర్వహించేలా పనిచేస్తానని తెలిపారు.

కోడ్ వచ్చినా తొలగని పోస్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ : సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా మండల కేంద్రంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లను దర్శనమిస్తున్నాయి. అధికారులు హెచ్చరిస్తున్నా నాయకులు పట్టించుకోకపోవడం గమనార్హం.

కష్టకాలంతో తోడున్నవారిని ఆదరించండి



రామచంద్రాపురంలో కరపత్రాలను అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి



కాసరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: నాలుగున్నరేళ్లు అందుబాటులో ఉండి.. కరోనా వంటి కష్టకాలంలో తోడుగా నిలిచి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించి మరో సారి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి కోరారు. శనివారం తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి నాలుగన్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కరోనా వంటి కష్టకాలంలో కనిపించకుండా హైదరాబాద్‌లో తలదాచుకున్న బొజ్జల కుటుంబం ఎన్నికలకు రెండు నెలల ముందొచ్చి కపటప్రేమ చూపుతోందని విమర్శించారు. ప్రజలే విజ్ఞతతో ఆలోచించి మీ ఇంటి మనిషిగా, తోడుగా ఉన్న మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, సర్పంచ్ సుబ్బయ్య, మహబూబ్‌బాషా, షబ్బీర్ బాషా, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, గెరటారెడ్డి, బోర్డు సభ్యుడు రమణయ్యనాయుడు, షరీఫ్, షామీర్, రమేష్, కన్నలి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీను, గోవింద స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

రేణిగుంట: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో శనివారం ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీకాళహస్తి మండలం వేలవేడులో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పార్టీ అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ భానుమూర్తి యాదవ్, సర్పంచ్ బాలగురవమ్మ, గుణశేఖర్, వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, రఘుకేశవరెడ్డి, సురేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు మండలం కాసరంలో సచివాలయం, ఆర్‌బీకే నూతన భవనాలను, చియ్యవరంలోనూ సచివాలయం, ఆర్‌బీకే నూతన భవనాలను బియ్యపు శ్రీవాణిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మండలంలో వేలవేడులో సచివాలయ నూతన భవనాన్ని శ్రీవాణిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం వాసు నాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, కోవి చంద్రయ్యనాయుడు, భిల్లీబాబు, ప్రభాకర్, సురేష్‌రెడ్డి, మధురెడ్డి, రాఘవులు, రఘునాథరెడ్డి, అలంకారం, సురేష్, సర్పంచ్ సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సంబరాలు



కేక్ కట్ చేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అభ్యర్థిగా బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మరోసారి టిక్కెట్ ప్రకటించడంతో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలిచైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచ పేల్చి జై జగన్ నినాదాలు చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని. ఈసారి మరింత మెజారిటీ ఖాయమన్నారు. నాయకులు హరినాథ్‌నాయుడు, చంద్రయ్యనాయుడు, శివ యాదవ్, పసల కుమారస్వామి, పాండు, శ్రీనివాసులు, సునీతాసింగ్, బాబు, రమేష్, ధన,బాల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పోలీసు, కేంద్రబలగాలతో పురవీధుల్లో కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాన్య ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిస్తామని భరోసా కలిగించేందుకు కవాతు నిర్వహిస్తున్నామన్నారు.

లోక్ అదాలత్ తీర్పే అంతిమం





సత్యవేడు: కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గోపాల కృష్ణ, మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: లోక్‌అదాలత్‌లో తీర్పే అంతిమమని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పట్టణంలోని న్యాయస్థాన భవన ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, దీనికి అప్పీలు లేదన్నారు. కాగా పలు రకాల కేసులను రాజీ చేసి రూ.1,61,76,550 రికవరీ చేసినట్లు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, ఇన్‌చార్జి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి సత్యకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యవేడులో 61 కేసుల పరిష్కారం

సత్యవేడు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 61 కేసులు పరిష్కరించి, రూ. 21,76,188 రికవరీ చేసినట్లు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాల కృష్ణ తెలిపారు. సివిల్ కేసుల్లో రూ.11,71,889, ఈపీ కేసుల్లో రూ. 3,25,000, చెక్‌బౌన్స్ కేసులో రూ. 5,00,000, బ్యాంకు కేసుల్లో రూ. 1,78,300, అపరాధ రుసుం, రూ.1000 వంతున రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

రేణిగుంట లబ్ధిదారులకు ఇళ్లస్థలాలు అప్పగింత



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పవిత్రారెడ్డి

రేణిగుంట: ఏర్పేడు మండలం పాగాలి రెవెన్యూ పరిధిలో రేణిగుంటకు చెందిన 2వేల మంది లబ్ధిదారులకు శనివారం ఇళ్లస్థలాలు అప్పగించారు. లేఅవుట్ వద్దకు చేరుకున్న లబ్ధిదారులకు ఆయా ప్లాట్ నంబర్ల సూచిక బోర్డుల సాయంతో రెవెన్యూ సిబ్బంది వారి స్థలాలను చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రేణిగుంట మండలంలో 10వేల మందికి 'నవరత్నాలు-జగనన్న ఇళ్లు' పథ కం కింద ఇంటిపట్టాలు ఇచ్చామని గుర్తు చేశారు. వాటిలో 2వేల మందికి ఏర్పేడు మండలం పాగాలిలో స్థలం కేటాయించారని, ఆ భూమిలో కొందరు రైతులకు పరిహారం ఇచ్చారని, మరికొందరికి ఆలస్యం కావడం వల్ల ఇన్నాళ్లు స్థలాలు చూపలేకపోయామన్నారు. పరిహార నిధులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో విడుదలయ్యాయన్నారు. త్వరలోనే రైతుల ఖాతాలకు జమ చేస్తారని తెలిపారు. రైతులను ఒప్పించి ముందస్తుగానే స్థలాలను లబ్ధిదారులకు కేటాయిస్తున్నట్లు ఆమె వివరించారు. రైతుల్లో కొందరు కోర్టుకు వెళ్లడం వల్ల మరింత జాప్యం జరిగిందన్నారు. తాము మోసపూరిత మాటలు చెప్పి తప్పించుకునే వాళ్లం కాదని, కొంత ఆలస్యమైనా చెప్పినమాటకు కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎంపీపీ కలపాటి హరి ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



శ్రీకాళహస్తి: మండలంలోని ఓబులాయపల్లి, అక్కుర్తి, ముచివోలు, తొండమనాడు, ఎగువవీధి, వేడాం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణి రెడ్డి పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. నాయకులు శ్రీనివాసులురెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం సాధ్యం





సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు, నాగలాపురం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏర్పేడు: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని అంజిమేడులో శనివారం మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో బూత్ కన్వీనర్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కరపత్రాలు అందజేశారు. సర్పంచ్ తాతేకాల్వ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, గున్నయ్య, కేశవులురెడ్డి, దామోదరంరెడ్డి, రాంబత్తెయ్య, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: మండలంలోని బైటకొడియంబేడు గ్రామంలో శనివారం సర్పంచ్ చిన్నదొరై సుధా, జేసీఎస్ మండల కన్వీనర్ మోహన్ మొదలియార్ ఆధ్వర్యంలో 'మేము సిద్ధం... మా బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. బూత్ కన్వీనర్ల నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని, మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. బీకేబేడు సర్పంచ్ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు శ్యామ్, హరిబాబు, కులశేఖర్, చిరంజీవి, దేశప్పన్, దేశన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ దౌర్జన్యకాండపై వినుత విలాపం



విలపిస్తున్న జనసేన వినుత

రేణిగుంట: శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అనుచరులు తన ఇంటి ముందు బాణాసంచ కాల్చి రెచ్చగొట్టడమే కాకుండా అడ్డొచ్చిన తమ కార్యకర్తలపై దాడి చేయడంపై జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నగరం వినుత విలపించారు. టీడీపీ నాయకుల చేష్టలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. బొజ్జల సుధీర్‌రెడ్డికి టికెట్ కేటాయించ డంతో, పొత్తులో భాగంగా టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న వినుత తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇదే సమయంలో సుధీర్ అనుచరులు మూడు రోజుల కిందట జనసేన కార్యాలయం ముందు బాణాసంచ కాల్చి సంబరాలు నిర్వహించి, అడ్డు వచ్చిన జనసేన కార్యకర్తలపై దాడి చేశారు. దీంతో మా కా ర్యాలయం ముందు వచ్చి టపాసులు కాల్చి రెచ్చగొట్టడానికి టీడీపీ వాళ్లకు సిగ్గుండాలి..? అంటూ విలపించారు. టికెట్ రాగానే గెలిచిపోయినట్లు సుధీర్‌రెడ్డి ఊహల్లో ఉన్నాడని మండిపడ్డారు.

సుధీర్‌కే ఎస్సీవీ మద్దతు

మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన నివాసంలో శనివారం ఆత్మీయుల సమావేశం నిర్వహించారు. తాను బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపునకు కలసి పని చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

తేరుకోని ఆనంద్

టీడీపీ మిత్రపక్షం బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తనకు టికెట్ దక్కకపోవడంతో ఇంకా షాక్‌లోనే ఉన్నారు. ఆయన అనుచరులు మాత్రం ఎన్నికల ప్రచారం చేస్తుండటం గమనార్హం.

ఆదిమూలంకు టికెట్‌పై తమ్ముళ్ల నిరసన

- పార్టీశ్రేణులకు వెన్నుపోటు పొడిచారని ఆగ్రహం
- ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే పరిస్థితి లేదని స్పష్టం



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పిచ్చాటూరు: టీడీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా కె.ఆదిమూలంను ప్రకటించడంపై మండలంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ పిచ్చాటూరు పట్టణ అధ్యక్షుడు రాజేంద్రన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేకు టీడీపీ టికెట్ ఇవ్వడం న్యాయమేనా.. ? అంటూ అధినేత చంద్రబాబును ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాలు ఎవరితో అయితే పోరాడామో అదే వ్యక్తికి పార్టీ టికెట్ ఇవ్వడం దారుణమన్నారు. నాయకుడు చిరంజీవి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కేసులు పెట్టించి వేధించిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం టీడీపీ కేడర్‌కు ద్రోహం చేయడమేనన్నారు. దీనివల్ల పార్టీ కేడర్ ప్రజల్లోకి వెళ్లి టీడీపీకి ఓటు అడిగే పరిస్థితి లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టీడీపీ అధిష్టానం స్పందించి పార్టీ టికెట్‌పై పునః పరిశీలించాలని పలువురు నాయకులు కోరారు. నాయకులు బాబు నాయుడు, రాజ, నెహ్రూ, జయచంద్రన్, నందగోపాల్, సురేష్ నాయుడు, పురుషోత్తం, రవి తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన నృత్య ప్రదర్శన

రేణిగుంట: శ్రీకాళహస్తి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధూర్జటి కళా ప్రాంగణంలో నృత్య ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ముగింపురోజున వెంకటగిరికి చెందిన ప్రత్యూష భరతనాట్య నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఓం శివ శంభో, అన్నమయ్య కీర్తనలు, అమ్మవారి భక్తిపాటలకు నయనానందకరంగా హావభావాలను పలికిస్తూ ఓలలాడించింది.



ప్రత్యూష నృత్య ప్రదర్శన

